క్లుప్తంగా

రేపు పెంచలకోనలో ఉగాది వేడుకలు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 4 గంటలకు మూలమూర్తికి అభిషేకం, 5 గంటలకు పూలంగి సేవ, 9 గంటలకు బంగారు గరుడ వాహనంపై క్షేత్రోత్సవం, 11 గంటలకు పంచాంగ శ్రావణం, కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు గోనుపల్లిలోని పెనుశిల నరసింహస్వామి ఆలయంలో ఉగాది ఉత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.

కండలేరులో 7.932 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 7.932 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తిరుపతి స్విమ్స్‌కు వెళ్లి పింఛను పంపిణీ



తిరుపతి స్విమ్స్‌లో పింఛను అందజేస్తున్న మహిళా పోలీస్ ప్రవల్లిక

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన పురిణి విజయ తిరుపతి స్విమ్స్‌లో శస్త్ర చికిత్స చేయించుకుని ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉంది. ఆమెకు ఈ నెల పింఛను నగదును పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌తోకలిసి మహిళా పోలీస్ ప్రవల్లిక తిరుపతికి వెళ్లి అందజేశారు. వీరి సేవలను స్థానిక ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నపూర్ణరావు అభినందించారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

చిల్లకూరు : వేసవిలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరిగిపోతున్న క్రమంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 12 గంటలలోగా బయట పనులు చూసుకుని ఇంటికి వెళ్లిపోవాలని సూచించారు. లేదా ఎక్కడైనా చల్లగా ఉండే ప్రాంతాల్లో సేదదీరి మధ్యాహ్నం నాలుగు గంటల తర్వాత బటయకు వచ్చేలా చూసుకోవాలని పేర్కొన్నారు. బయటకు వెళ్లే సమయంలో ప్రతి ఒక్క రూ వాటర్ బాటిల్, గొడుగు తప్పక తీసుకువెళ్లాలన్నారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ తీసుకోవాలని వెల్లడించారు.

పురోహితులకు ఫలసరుకుల వితరణ



ఫలసరుకులు, సంభావన అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

వాకాడు : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని పట్టాభిరామాలయంలో సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితులకు ఫల సరుకులు, కూరగాయలు, సంభావన అందజేశారు. ఎన్ఆర్ఐ రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.2 లక్షలు అందజేశారు. వాటిని ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దీవి అనంతాచార్యులు, సంస్థ ప్రతినిధి దీవి వంశీప్రియ జ్యోతి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురంలో ఓ ఇంటిలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. ముందస్తు సమాచారం మేరకు కొత్త వీరాపురం గ్రామానికి చెందిన మునెయ్య ఇంటిలో సోదాలు చేయగా పది మద్యం బాటిళ్లను పోలీసులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

నేత్రపర్వంగా పాండురంగ స్వామి కల్యాణం

పిచ్చాటూరు: పట్టణంలోని శ్రీధర్మరాజుల స్వామి ఆలయం వద్ద శనివారం అర్ధరాత్రి శ్రీపాండురంగ స్వామి, రుక్మిణీదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలంకరణలు, అరటి తోరణాలు, రంగవల్లులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేదికపై శ్రీపాండురంగ స్వామి, విఠోభాయి దంపతుల చిత్రపటాన్ని కొలుదీర్చి అందంగా ముస్తాబు చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం చిన్నారుల పండరిభజన గజ్జ పూజ ఆదివారం వేకువజామున 4 గంటల వరకు భక్తిప్రపత్తులతో జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా భక్తజనం తరలి వచ్చారు. చిన్నారులకు పండరి భజన దుస్తులను గ్రామ యువకులు వితరణగా అందజేశారు. పండరి భజన నేర్పిన మాస్టర్లు లోకేష్, శివకుమార్, తులసి, శ్రీవాణిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

‘ప్రభుత్వం చేసిన మంచిని వివరించండి’

- ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలి
- ఉగాది నుంచి వైఎస్సార్ సీపీ ప్రచారం ప్రారంభం
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం వెంకటగిరిలోని తన నివాసంలో ఉన్న ఎన్‌జేఆర్ భవనంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రానున్న 30 రోజులు చాలా కీలకమన్నారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకుపోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు మండలాల్లో ప్రచారం ప్రారంభించినట్టు తెలిపారు. వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆశీస్సులతో ఉగాది పండుగ పర్వదినం నుంచి మున్సిపాలిటీలో ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కార్యకర్తలు, నాయకులను 10 బృందాలుగా ఏర్పాటు చేశామని, ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎల్లో మీడియా దుష్ప్రచారం కారణంగా వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నారని తెలిపారు. వారికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వివరించారు.

టీడీపీలో విసిగి వేసారి వైఎస్సార్‌సీపీలోకి వచ్చాం

వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞ కుమార యాచేంద్ర మాట్లాడుతూ తమ కుటుంబం మొదటి నుంచి టీడీపీ కోసం పనిచేసేదని తెలిపారు. పార్టీ, చంద్రబాబు నాయుడు చేస్తున్న చేష్టలకు విసుగుచెంది వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటుచేసి ఇంటి వద్దకే పరిపాలన అందిస్తున్నారని గుర్తు చేశారు. దీన్ని చూసి ఓర్వలేని చంద్రబాబు తన నమ్మినబంటు నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ వ్యవస్థను రద్దుచేసే కుట్ర చేస్తున్నట్టు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కాపీ కొట్టి చంద్రబాబు నాయుడు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధిస్తుందని, వలంటీర్ల వ్యవస్థపై సీఎం జగనన్న తొలి సంతకం చేస్తారని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషిచేశామని, అదే తరహాలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతుశారద, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయంలో సోషల్ మీడియా కీలకం



సోషల్ మీడియా కన్వీనర్లకు దిశానిర్దేశం చేస్తున్న విజితారెడ్డి

గూడూరు రూరల్ : ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వైఎస్సార్‌సీపీ విజయంలో సోషల్ మీడియా కీలక భూమిక పోషించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు చెన్నూరు విజితారెడ్డి సూచించారు. ఆమె ఆదివారం గూడూరులోని సనత్‌నగర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో చేవూరు విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గూడూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ విజయం కోసం సోషల్ మీడియా కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఐకమత్యంతో బూత్ కమిటీలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ కన్వీనర్ రుద్రరాజు శ్రీనివాసులు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాంద్ర నారాయణరెడ్డి, నియోజకవర్గంలోని సోషల్ మీడియా కన్వీనర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్నను సీఎంగా చేసుకోవడమే లక్ష్యం



గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవడమే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకుడు యద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గూడూరు రూరల్ పరిధిలోని దివిపాళెం, చవటపాళెం, గాంధీనగర్ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని కలుసుకుని కరపత్రాలను అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలన్నా, పేదలకు సంక్షేమ పథకాలు ఎలాంటి ఆటంకం లేకుండా అందాలన్నా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రతి గడపలో లభిస్తున్న ఆప్యాయత చూస్తుంటే పేద ప్రజల గుండెల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిలిచిపోయారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించి దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా జనరంజక పరిపాలన అందించారని గుర్తు చేశారు. కల్లబొల్లి మాటలు చెప్పేవారిని నమ్మకుండా విజ్ఞతతో ఆలోచించి మంచిచేసే వారికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పరిశీలకులు ఎం.ఆర్.సి.రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, ఎంపీపీ బూదూరు గురవయ్య, మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, 24 సొసైటీ అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులురెడ్డి, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, విద్యాసాగర్, బాబురెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, కందలి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, మనుబోలు కృష్ణయ్య, ప్రభాకర్‌రాజు, రమేష్, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

నేడు రాపూరు మండలంలో నేదురుమల్లి రోడ్ షో

రాపూరు: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి సోమవారం రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు పెంచలకోనలో లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుంటారని తెలిపారు. 10 గంటలకు పంగిలి గ్రామం, 12 గంటలకు మద్దెలమడుగులోని పార్టీ కార్యాలయంలో మండలంలోని అన్ని పంచాయతీల నాయకులతో సమావేశమవుతారని వెల్లడించారు. 3 గంటలకు వీరాయిపాళెం, 4 గంటలకు బొజ్జనపల్లి, 4.30 గంటలకు రావిగుంటపల్లి, 5 గంటలకు పులిగిలపాడు గ్రామాల్లో రోడ్ షో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అలాగే రాత్రి 7 గంటలకు రంజాన్ మాసం సందర్భంగా రాపూరు షాదీ మంజిల్‌లో ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమాల్లో మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండండి



డక్కిలి: డి.వడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

డక్కిలి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ఆదరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీ జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి కోరారు. వారు ఆదివారం డి.వడ్డిపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాలను వివరించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ఇంటి వద్దకే అందించినట్టు తెలిపారు. చేసిన మంచిని గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.చెంచయ్య, ఎంపీటీసీ ఎస్.చెంచయ్య, నాయకులు ఆంజనేయులు, సుబ్బరాయుడు, పాపయ్య, ఎం. నారాయణరెడ్డి, చిరంజీవి, బండి రమేష్‌రెడ్డి, పెంచల నారాయణరెడ్డి, డీపీ యాదవ్, నాగభూషణంరెడ్డి, వేణు నాయుడు, శ్రీహరిరెడ్డి, వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



ప్రచార వాహనం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

నాయుడుపేట టౌన్ : పేద ప్రజలకు మంచి జరగాలన్నా, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నా నువ్వే కావాలి జగన్, మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. నాయుడుపేటలో మహిళలు సీఎం జగన్ ప్రచార వాహనాల వద్దకు వచ్చి సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని గెలిపించాలని ఆటోల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పట్టణంలోని అగ్రహారపేట వీధిలో ఆదివారం ముగ్గురు మహిళలు ఆటోను తమ ఇంటి ముందు నిలిపి సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తిరిగి సీఎంగా ప్రమాణస్వీకారం చేయాలని ఆశీర్వాదం అందించారు.

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ప్రచారం చేస్తున్న నేతలు

సైదాపురం: ప్రతి కుటుంబానికీ మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులురాజు కోరారు. వారు ఆదివారం చాగణం రాజుపాళెం గ్రామంలో సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ సుమతి, నేతలు అబ్బిరాజు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. వారు పొందిన లబ్ధిని వివరించి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వెంకటగిరి అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, మండల నేతలు మాలకొండారెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండి వెంకటేశ్వర్లురెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కె.మోహన్‌రావు, శంకర్‌రెడ్డి, వివేక్, వెంకటరమణయ్య, శివయ్య, రాధారెడ్డి సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



రాపూరు-గోనుపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రాపూరు : పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి తెలిపారు. వారు ఆదివారం రాపూరు మండలం గోనుపల్లి, పంగిలి గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హతే ప్రమాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసినట్టు తెలిపారు. ప్రతి పేదవానికీ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయాలని కోరారు. లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నెల్లూరు శివకుమార్‌రెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సర్పంచ్ నారాయణమ్మ, శ్రీనివాసులు, తిరుపాల్, వెంకటేశ్వర్లు, వెంకటాద్రి, ఆర్.వరబాబు తదితరులు పాల్గొన్నారు.

170 కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ



పేద ముస్లింలకు రంజాన్ కిట్లు అందజేస్తున్న రియాజ్ అహ్మద్, తదితరులు

గూడూరు రూరల్ : జకాత్ అంటే ప్రతి ముస్లిం తనవద్ద ఉన్న ధన, విలువైన వస్తువుల్లో 2.5 శాతం పేదలకు దానం చేయాలని ఇస్లాంలో నిర్దేశించినట్లు మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ తెలిపారు. గూడూరులోని షాదీ మంజిల్‌లో ఆదివారం మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ సంస్థ ఆధ్వర్యంలో 170 కుటుంబాలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ నెల నిరుపేదల నెల అని, ఆధ్యాత్మికతతోపాటు అల్లాపై విశ్వాసం, ఐదు పూటలా నమాజ్, ఉపవాసం, హజ్‌యాత్ర, జకాత్‌ను పొందుపరిచినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలేషా, సంస్థ సలహాదారు అబ్దుల్ రహీం, సభ్యులు షేక్ అన్వర్‌బాషా, మహబూబ్‌బాషా, రఫీ, రవూఫ్, జానీబాషా, కరీముల్లా, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామ రక్ష



పెట్లూరులో ప్రచారం చేస్తున్న మండల అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి

వెంకటగిరి రూరల్ : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు వైఎస్సార్ సీపీకి శ్రీరామ రక్ష అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం పెట్లూరులో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వెంకటగిరి ఎమ్మెల్యే, తిరుపతి ఎంపీ అభ్యర్థులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీటీసీ పెంచలయ్య, సర్పంచ్ సక్కు బాయమ్మ, కంచి గురుప్రసాద్, వెంకటస్వామి, హరిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, నాగరాజుయాదవ్, మల్లికార్జున్, రాజారెడ్డి, సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



అమరాగార్డెన్ మక్కా మసీదు వద్ద సహరి విందులో పాల్గొన్న ముస్లింలు

నాయుడుపేట టౌన్:నాయుడుపేటలోని జామీయా, అమీర్‌షావలి, నూర్, మక్కా మసీదులతోపాటు ఎల్ ఏసాగరం పాత, కొత్త బీడీకాలనీ, పాగొట్టం, మునిరత్నం, చంద్రబాబునాయుడు నగర్ కాలనీలోని అల్‌మదినా, షాహి, ఇబ్రహీమ్, బిలాల్, ఎబదర్ మసీదుల్లో షబేఖదర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షబేఖదర్ ఖురాన్ అవతరించిన రాత్రిగా మత పెద్దలు వివరించారు. ముస్లింలు రాత్రంతా జాగారం చేస్తూ మసీదుల్లో ఖురాన్ పారాయణం చేశారు. మత పెద్దలు షబేఖదర్ విశిష్టతను వివరించారు. క్రమశిక్షణ, ఐక్యత, ప్రేమ, దానగుణం తదితర సుగుణాలను అలవరుచుకునే విధానమే రంజాన్ మాసమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన ఆదాయంలో కొంతభాగాన్ని కష్టాల్లో వున్న వారికి దానం చేయాలన్నారు. అదే విధంగా ఫీత్ర(దానం) ఎంతో ముఖ్యమన్నారు. కుటుంబంలో ఎంత మంది వుంటే అంత మంది పేరున ఖచ్చితంగా ఫీత్ర దానం చేయాలన్నారు. ఈ యేడాది ఇక్కడి ఒక ఫీత్ర రూ.80లుగా నిర్ణయించినట్లు మత పెద్దలు వివరించారు. ఈ మొత్తాన్ని రంజాన్ పండుగ ముందే పండుగ చేసుకోలేని నిరుపేదలకు అందజేయాలన్నారు. షబే ఖదర్ రాత్రంతా జాగారం చేసిన ముస్లింలకు అన్ని మసీదుల్లో ఆదివారం సహరి విందును ఏర్పాటు చేశారు.

జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి



దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న డాక్టర్ రేవంత్ చక్రవర్తి.



గమళ్లపాళెం ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రేవంత్ చక్రవర్తి

గూడూరు రూరల్ : రాష్ట్ర అభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తనయుడు డాక్టర్ రేవంత్ చక్రవర్తి తెలిపారు. ఆయన ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గూడూరు మున్సిపాలిటీ 11వ వార్డులోని గమళ్లపాళెం, త్యాగరాజావీధి, ఠాగూర్‌వీధి, శంకర్‌రెడ్డివీధి, యల్లావారివీధిలో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. వృద్ధులు, వికలాంగులను కలుసుకుని జగన్ మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉంది, సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి అని ఆరా తీశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గూడూరు ఎమ్మెల్యేగా మేరగ మురళీధర్, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్లు కృష్ణప్రసాద్‌రెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, గోపీ యాదవ్, అల్తాఫ్, చిట్టేటి శివ, హరీష్, హర్ష, ప్రశాంత్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు అన్నం మురళి, నిరూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు అల్లాడుతున్న గేదెలు



కారికాడులో గుంటలో ఉన్న గేదెలు

దొరవారిసత్రం : రోజు రోజుకు ఎండల తీవ్రత పెరగడంతో గ్రామాల్లోని గేదెలు అల్లాడిపోతున్నాయి. బురదలో మునుగుతూ ఎండ తాపం నుంచి ఉపశమనం పొందుతున్నాయి. దొరవారిసత్రం మండలంలోని తీర గ్రామాలైన కారికాడు, మీజూరు, వేలికాడు, కట్టువాపల్లి, తొగరాముడి తదితర గ్రామాల్లో ఎండలు మండిపోవడంతో ఆయా ప్రాంతాల్లోని గేదెలు చెరువులు, గుంటల్లోని బురదలోనే పగలంతా ఉండిపోతున్నాయి. మరికొన్ని రోజులకు చెరువుల్లో అరకొరగా ఉన్న నీరు పూర్తిగా ఎండిపోతే పశువులను ఎలా కాపాడుకోవాలో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.